International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-3 (1), March, 2017
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

# వివాహ మహోత్సవం - జానపదుల ఆచార వ్యవహారాలు

డా. యం. విజయలక్ష్మి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆర్.బి.వి.ఆర్.ఆర్. మహిళా కళాశాల, హైదరాబాద్

సకల జీవులకును వాయువు ఎట్లు ముఖ్యాధారమో గృహస్థాశ్రమము కూడా అన్ని ఆశ్రమములకును ఆధారము. బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమముల వారు గృహస్థాశ్రమము నుండియే జ్ఞానంతోపాటు ఆహారమును కూడా పొందుచున్నారు. అందువలన గృహస్థాశ్రమమును ఎంతో శ్రేష్ఠమైనదిగా పేర్కొనవచ్చు. స్వర్గమును, ఐహికసుఖములను కోరునట్టివారు గృహస్థాశ్రమమును ఆశ్రయించవలెనని మనుస్మృతి యందు చెప్పబడింది. కనుక గృహస్థాశ్రమమున అడుగిడుటకు వివాహ సంస్కారమత్యవ సరమని తెలియుచున్నది. కుటుంబము సంఘంలో ఒక భాగమగుటచేత వివాహము లేనిచో కుటుంబముండదు. వివాహ సంస్కారము లేనిచో సంఘంలో కుటుంబమునకు పరిగణనముండదు. కనుక వివాహమనేది తప్పనిసరియని గ్రహించవచ్చును.

మనిషి మొదటి నుండి సంఘజీవి కావడం చేత ఈ సంఘజీవనమే ఆదిమానవుని ఆధునిక మానవునిగా తీర్చిదిద్దింది. మొదట్లో ఆదిమానవుడు జంట జంటలుగా నివసించడానికి ఆనాటి పరిస్థితులు సాధ్యపడలేదు. కారణం అడవులలో, కొండలలో జీవించడం వలన వేట, క్రూరమృగాల నుండి రక్షణ మొదలైన అవసరాలు గుంపుజీవన పద్ధతికి దారి తీసినది. గుంపులో అంతా కలసి వేటాడి ఆహారం సంపాదించుకొని దాన్ని పంచుకు తినేవారు. జంతువులతో పాటు కలసి జీవిస్తుండడం వలన వాటివలే వావివరుసలనేవి లేకుండా విచ్చలవిడిగా అంటే ఉద్రేకం కలిగినపుడు జతకూడడం జరిగేది. జంతువులను వేటాడి తింటూ ఆకలి తీర్చుకొనే ఆ రోజుల్లో మనిషికి బాధ్యతలు, నియమాలంటూ ఏమి ఉండేవికావు. అందువలన ఆరంభ దశలో మానవులలో తల్లి తనయుడు, తండ్రి కుమార్తె, అన్నా చెల్లెలు, అక్కా తమ్ముడు అనే విచక్షణ లేకుండా విచ్చలవిడిగా స్వేచ్ఛా సంగమం జరిగేది. దీనివలన ఆ కాలంలో పుట్టిన బిడ్డకు తల్లులు ఎవరో తెలిసేది కాని తండ్రి ఎవరో తెలిసే అవకాశం లేకపోయింది. ఈ కారణంగా తల్లుల ద్వారా మాత్రమే ఒక తరానికి మరో తరానికి మధ్య పారంపర్యం కొనసాగింది. కాలక్రమేణా గుంపులో ఒక తరానికి మరో తరానికి మధ్య అంటే తల్లితరానికి. కొడుకు తరానికి, తండ్రి తరానికి, కుమార్తె తరానికి మధ్య భార్యభర్తల సంబంధం నిషేధించబడింది. అయితే ఒక తరంలోని స్త్రీ పురుషుల మధ్య అంటే అన్నా చెల్లెలు, అక్కాతమ్ముళ్ళు మధ్య ఈ సంబంధము కొనసాగేది.

ఆ తరువాత కొంత కాలానికి ఒక గుంపులో రక్తసంబంధీకుల మధ్య వివాహం నిషేధించబడి, ఒక గుంపులో స్త్రీలను మరో గుంపులోని పురుషులు వివాహం చేసుకోవడం ప్రారంభమైంది. అంటే ఒక గుంపులోని అక్కాచెల్లెళ్ళు, వేలు విడిచిన అక్కా చెల్లెళ్ళందరికి వేరే గుంపు నుండి వచ్చిన అన్నదమ్ములు, వేలు విడిచిన అన్నదమ్ములందరూ భర్తలుగా ఉండేవారు. దీన్ని 'గుంపు పెళ్ళి పద్ధతి' అని అంటారు. ఒక స్త్రీకి ఒకే పురుషునికి మధ్య శాశ్వత వివాహబంధం అనేది ఇంకా ఆనాటికి ఏర్పడలేదు. కాలం గడిచే కొద్ది మానవ సమాజంలో గుంపు పెళ్ళి పద్ధతి పోయి 'జంట పెళ్ళి పద్ధతి' వచ్చింది. అంటే గుంపులో ఒక పురుషుడు ఒక స్త్రీతో

వివాహబంధం కలిగి ఉండడం. ఈ పద్ధతిలో స్త్రీ, పురుషుల్లో ఎవరు ఎప్పుడు విడిపోవాలనుకున్నా, వేరే వారితో కలిసి ఉండాలన్నా స్వేచ్ఛ ఉండేది. ఆ తరువాత పురుషాధిక్యత పెరగడంతో వివాహ పద్ధతిలో మార్పు వచ్చి పురుషునికి, ఆస్తికి వారసునికనే వస్తువుగా స్త్రీ మారిపోయింది. అందువల్ల వివాహ బంధం మార్పుచెంది, దంపతీ వివాహ పద్ధతి ఏర్పడి, స్త్రీ పురుషులలో ఎవరు కోరుకున్నా విడిపోయే అవకాశం లేకుండా పోయింది. అయితే ఇది ఆచరణలో మాత్రం మగవారికి వర్తించలేదు. వేటాడుతూ సంచార జీవితం గడిపే మానవుడు వ్యవసాయోత్పత్తి జరిగిన పిమ్మట స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకోవలసి రావడంతో ఇల్లు, గొడ్డు, గోదాము చూసుకోవడం మొదలైన పనులు ఎక్కువవ్వడంతో తనకంటూ ప్రత్యేకంగా ఒక మనిషి తోడుంటే ఆ అవసరాలన్నీ తీర్చుకోవడానికి అవకాశముంటుందని గ్రహించడంతో ఆడదాని అవసరం మగవాడికి, మగవాడి అవసరం ఆడదానికి కలిగి అదే పెళ్ళికి ఆరంభమైంది.[1] అయితే మొదట్లో మగవాడు అవసరమనుకున్నంత మంది ఆడవారితోను. ఆడది అవసరమనుకున్నంత మంది మగవారితోను జతగూడడం జరిగేది. ఈ స్వేచ్ఛను అరికట్టి. ఒక పురుషునికి ఒకే స్త్రీ అను నియమమును ఏర్పరచుటకై పెళ్ళి అనే దానిని మన పెద్దలు ఏర్పాటు చేసియుండవచ్చును. మగవాడినిగాని, ఆడదానినిగాని ఒక్కరికో, ఒక గుంపుకో అందుబాటులో ఉండేటట్లు నిరోధించిందే పెళ్ళి. అంటే స్త్రీ పురుషులకుండే సంబంధాన్ని నిర్బంధించి, నియమాలు పెట్టి చేసేది పెళ్ళి.

'కామిగాక మోక్షగామిగాడు' అని మనవారు పేర్కొనుట చేత మోక్షమార్గమును అన్వేషించు వారు కామతృప్తిని పొందుట అత్యావశ్యకమైనది. అయితే ఈ కామతృప్తిని స్వేచ్ఛగా పొందుట వలన సంఘంలో అవ్యవస్థ ఏర్పడకుండుటకై మన పెద్దలు ఒక పురుషునకు ఒక స్త్రీ అను నియమమేర్పరచి సంఘాన్ని క్రమబద్ధము గావించిరి. దానితో సంఘజీవియైన మానవుడు సంఘం యొక్క ఈ కట్టుబాట్లను అతిక్రమింపక వాటిని అనుసరించడం వలన సంఘమునందు వివాహ వ్యవస్థ అత్యున్నత స్థానమును పొందినది.

'పిడికెడు విత్తనాలు మడికెల్లజాలు – ఒక్కడే కొడుకైన వంశాన చాలు

కొడుకొక్కడే చాలు కులముద్ధరింప"[2]

అనుట చేత కామవాంఛా సంతృప్తియే గాక వంశోత్పత్తి కొరకు కూడా ఈ వివాహ వ్యవస్థ రూపొందినదని తెలియుచున్నది. 'అపుత్రస్యగతిర్నాస్తి' పుత్రుడు లేకపోయినచో గతులు లేవనియు, పున్నామ నరకము నుండి రక్షించువాడు పుత్రుడే యనుటచేత దాంపత్య జీవిత పరమావధి సంతానఫలమే అను విషయం వ్యక్తమగుచున్నది. ఈ విధంగా రతి సంతానోత్పత్తికి, మోక్షసాధనమునకు ఆధారమైనది. పుత్రవాంఛ, సతి సంతతుల సంరక్షణ, గార్హస్థ్యము వివాహ సంస్కారమున ప్రతిబింబించు అంశములు. కనుక వివాహము నుండి గ్రహింపవలసినది కామ మొక్కటియేగాక ధర్మార్థములును కూడా. కావున ధర్మార్థకామముల సమన్వయమును సమకూర్చు సంయోగమే వివాహమని పించుకొనును.

**వివాహమును గూర్చి ప్రాచ్యపాశ్చాత్య విద్వాంసులు తెలిపిన అభిప్రాయాలు :**

*"Marriage is a constructive task of two persons of the opposite sex, who are determined to live together in order to relieve difficulties and enrich each other lives"*

వివాహమనగా ఒక పురుషుడు ఒక స్త్రీతో కలిసియుండుటకు నిశ్చయించుకొని ఒండొరులు కష్టముల నివారించుకొని సుఖముల నధికము చేసికొనుటకు గావించు కొనిన నిర్మాణ కార్యమని గాంధీగారి అభిప్రాయం.

వివాహము సృష్టి వికాసమునకు ఒక ధార్మిక సాధనమే కాని కేవలము శారీరక వాంఛలను తీర్చుకొనుటకు మాత్రం కాదని 'డా॥ విద్యా చౌహాన్' గారి అభిప్రాయము.[3]

'కామ ప్రేరణము, పితృవాత్సల్యము, తమ పేరును ఆస్తిని తరువాత తరములకు అందజేయవలెనను వాంఛ, ఆర్థిక భద్రతావశ్యకత, సహకారము, వృద్యాప్యమున స్నేహ సహాయముల కభయము, జీవితంలోని సుఖదుఃఖములను జయాపజయములను పంచుకొనగల భాగస్వామిని పొందవలయునను ఆశ మొదలైనవి వివాహమాడుటకు కారణములుగా ఆధునిక శాస్త్రజ్ఞుడైన పి. గిస్బర్ట్ గారు తెలియజేయడం జరిగింది.[4] ఇటువంటి సదాశయాలతో వివాహ వ్యవస్థ ఏర్పడిన దగుట చేత ఇది ఇప్పటికిని అవిచ్ఛిన్నముగా కొనసాగుచునేయున్నది.

ప్రాచీన కాలములో బ్రహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్య, అసుర, గాంధర్వ, రాక్షస పైశాచములను అష్టవిధ వివాహ పద్ధతులను శాస్త్రకారులు నిర్ణయించిరి.[5] ఇప్పటి వివాహాలు దేశకాల పరిస్థితులననుసరించి జరుగుచున్నది. ఇందులో పెద్దలు నిర్ణయించి జరిపే పెళ్ళిళ్ళేగాక ప్రేమ వివాహాలు, కులాంతర, మతాంతర, శాఖాంతర, రాష్ట్రాంతర వివాహాలు కూడా జరుగుతున్నాయి. మరియు వివాహంలో తాళి కట్టుటయే గాకుండా దండలు మార్చుకోవడం, ఉంగరాలు మార్చుకోవడం వంటివి కూడా అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఈ విధంగా ఇప్పటి వివాహాలలో అనేక మార్పులు చోటు చేసుకోవడం గమనించవచ్చు.

వివాహములందు అనేకములైన ఆచార వ్యవహారములు పాటించడం జరుగుతుంది. వీనిలో కొన్ని వైదికాచారములు మరి కొన్ని లౌకికాచారములు కలవు. వైదికాచారములు శాస్త్రం ప్రకారం, లౌకికాచారములు ఆనవాయితీ, రీతి, రివాజులననుసరించి నిర్వహింపబడును. ఈ రెండును కలసి మన వివాహాచారములలో కనబడుతున్నవి. మన సంఘమునందు ఆర్యద్రావిడ జాతి జనుల కలయిక వలన వారి ఆచారములును సమ్మేళనము చెంది, ఒక నూతన సమన్వయమేర్పడినది. దానితో మన సాంఘికాచారములన్నిటిలోను ఆర్యుల సంప్రదాయములును, దేశీయ సంప్రదాయములును నమ్మిశ్రితములై ఉన్నాయి. ఆర్యాచారములు కొంతవరకు సంస్కృతిచే ప్రసన్నములై ఉంటాయి. దేశీయాచారములందు మూఢ విశ్వాసముల పాలు అధికముగా కనబడుతుంది.

మన వివాహములందు ఆర్యాచారములు, దేశీయ పద్ధతులు కలగలుపుగా కనబడుతాయి. పాణిగ్రహణము, సప్తపది, సన్నెకల్లు తొక్కుట మొదలగునవి ఆర్యాచారములు కావుననే వీటికి వైదిక మంత్రములుంటాయి. ఈ మంత్రములు సంస్కృతంలో ఉండుట చేత పురోహితునిచే వివాహం జరిపిస్తారు. మంగళసూత్రధారణము దేశీయాచారముగానే భాసిస్తుంది. గావున మంత్రములతోగాక శ్లోకములతో నడుపుచున్నారు. తాళి కట్టుట అనే సంస్కారము జనులలో బహుళ వ్యాప్తినందినట్లు కనిపిస్తుంది. కొన్ని క్రైస్తవ కుటుంబాలలో కూడా ఇది (వధువునకు మంగళ సూత్రధారణము) కనిపిస్తుంది.[6] అయితే ఈ లౌకికాచారములలో పెక్కు మాండలిక భేదములు గోచరించుచున్నవి. ఒక్కొక్క మండలము నందు ఒక్కొక్క కులమునందు ఒక్కొక్క విధముగా ఈ ఆచార వ్యవహారములు పాటింపబడుచున్నవి. కన్యాదానం, మాంగల్యధారణ, తలంబ్రాలు, అరుంధతీ దర్శనము, అప్పగింతలు సర్వసామాన్యంగా అన్ని కులాల వారిలో మనకు కనిపిస్తాయి.

పూర్వం మనవారు వివాహలలో మేనరికమనగా మేనమామ మేనల్లునకు తన కుమార్తెనిచ్చి వివాహము చేయుట, దీనినే అన్నాచెల్లెళ్ళు వియ్యమందుట అంటారు.

'అందితే అన్నయ్యతో వియ్యమందాలి'[7] అని అన్నతో వియ్యమందుటను గొప్పగా భావించేవారని తెలుస్తున్నది. అంతేగాక మేనరికమును తప్పించి వివాహము చేయుట దోషముగా పరిగణించేవారు. అందువలన పూర్వం ఈ మేనరికాలను అన్ని వర్ణాలవారు పాటించుటను గమనించవచ్చును. మేనమామ కుమార్తెనే గాక మేనత్త కుమార్తెను కూడా వివాహము చేసుకొనుట కలదు. దీన్ని 'ఎదురు మేనరికము' అని అంటారు. ఇదేగాక అక్క కుమార్తె అంటే మేనకోడలిని వివాహము చేసుకొనే ఆచారము కూడా ఆంధ్రులలో కనిపిస్తుంది. ఈ విధంగా మేనరికములు వ్యాప్తి చెందుటకు కారణము పూర్వకాలములో దూరప్రాంతము వారితో, అపరిచితులతో వియ్యమందడానికి భయపడేవారు. కారణం వారి వంశమర్యాదలు, మంచిచెడ్డలు, నడవడిక, ఆచార వ్యవహారములు, సంప్రదాయములు తెలుసుకొనే అవకాశముండదు గనుక సొంత వారితోగాని, బంధువులతోగాని వియ్యమందేవారు. దీని వలన ఇరుపక్షాల వారి మధ్య సన్నిహితత్వము, అవినాభావసంబంధం మరింతగా పెరిగేది.

సాధారణముగా వివాహ సంబంధమును కుదుర్చుకొనుటకు వధువు తరపువారు వరుని ఇంటికి వెళ్ళి తమ కన్యనిచ్చెదమని చెప్పడం దానికి వారంగీకరించడం జరిగేది. అయితే మేనరికములో మాత్రము పుట్టింటి పైనున్న మమకారం చేత మేనకోడిలిని కోడలిగా చేసుకొంటానని ఆడబడుచు అన్నగారింటికి వెళ్ళి అడగడం సంప్రదాయంగా ఉండేది.

'పెద్దాయె గౌరమ్మ పెండ్లి చేతాము – ఎదిగింది గౌరమ్మ ఎవరికిత్తాము

ఊరిలో పెద్దలను అడిగి చూద్దాము – అందరికి మెప్పుగా అతివనిత్తాము"

– పై గేయాన్ని బట్టి పూర్వం ఊరిలోని పెద్దలను సంప్రదించి వివాహము జరిపించేవారని తెలుస్తుంది.

సంఘంలోని పెద్దలందరితో కూడి వర నిర్ణయం గావించి, పెండ్లి చేయు ఆచారము ఈనాటికినీ ఉంది. వివాహానికి ముందు వరుని మంచి చెడులను, వంశ మర్యాదలను, ఆస్తిపాస్తులను క్షుణ్ణంగా తెలిసికొన్న పిదపనే కన్యనిచ్చేవారు. వరుని ఎంపిక చేసుకొనేటప్పుడు కన్య ఆమె తల్లిదండ్రులు, బంధుమిత్రులు కొన్ని అభిప్రాయాలను కలిగియుండుట సహజం. ఆ విషయాన్ని

'కన్యావరయతే రూపమ్ మాతావిత్తమ్ పితాశ్రుతమ్

బాంధవా కులవిచ్ఛంతి మిష్టాన్నమితరే జనా"[8] శ్లోకంలో చక్కగా తెలియజేయడం జరిగింది.

అంటే కన్య వరుని రూపమును, తల్లి వరుని ఆస్తిని, తండ్రి వరుని విద్యను, బంధువులు మంచి కులమయిన చాలునని, తక్కినవారు పిండి వంటల భోజనమును కోరుదురని భావము. అదే విధముగా వరుని తరపువారు కూడా కన్య యొక్క మంచి చెడులను సంప్రదాయాలను పరిశీలించిన మీదటనే వివాహమునకు అంగీకరించేవారు.

కుమార్తెకు వివాహము చేయదలచిన తండ్రి తగిన సంబంధము కలదని తెలిసిన పిదప తాను ఒంటరిగా గాని లేదా బంధుమిత్రులతో, మధ్యస్థులతో కలసి గాని వరుని ఇంటికి వెళ్ళి తమ వంశ మర్యాదలను తెలుపుకొని తన కుమార్తెను వారి కుమారునకు వివాహము చేసుకొమ్మని వరుని తండ్రిని కోరును. అతడంగీకరించిన పిదప ఒకరికొకరు వధూవరుల జాతకములను మార్చుకొంటారు. ఈ జాతకములు చూచుకొనుటకు ముఖ్యంగా అగ్రవర్ణముల వారు మాత్రమే పాటింతురు. జాతకములు కుదిరిన పిమ్మట వధువును చూచుటకు పెద్దల ప్రేరణచే వరుడంగీకరించి వధువు గృహమునకు పోవుటయో లేదా వధువే వరుని గృహమున కేగుటయో జరుగును. వధూవరులిరువురు ఒకరినొకరు చూచుకొను ఈ తతంగమునే 'పెండ్లి చూపులు' అని అంటారు. ఈ పెండ్లి చూపులకు మునుపే వంశమర్యాదలు, ఆచారవ్యవహారములు, సంప్రదాయములు, మంచిచెడ్డలు, వధూవరుల నడవడికలను ఇరువైపుల వారు తెలుసుకోవడం జరుగుతుంది.

వధూవరుల పక్షం వారు కట్నకానుకలు మొదలైన విషయాలను గూర్చి చర్చించుకొని ఒక అంగీకారానికి వచ్చిన పిదప సంబంధాన్ని నిశ్చయముగావించుకొని పురోహితుని సంప్రదించి వివాహలగ్నమును నిర్ణయించుకొంటారు.

'లగ్న పత్రిక జూచి లలితముగవారు విఘ్నేశ్వరుని పూజ వేడ్కతో చేసి"[9]

– అనుటచే ఏ విధమగు విఘ్నములు కలుగకుండా వివాహము జరుగవలెనని ముందుగా ఒక శుభముహూర్తము చూసుకొని గణపతిని పూజించి వివాహమున కవసరమగు వాటిని సమకూర్చుకొంటారు. ఈ కార్యక్రమము వధూవరులిరువురి ఇండ్లయందును జరిపిస్తారు. ఆదినమున వధువు తల్లి విఘ్నేశ్వరునికి పూజ గావించి, ముత్తైదువలను పిలిచి పెద్ద ముత్తైదువచే తిరుగలికి పూజ చేయించి బియ్యము, సెనగలు కలిపి

విసరిస్తారు. తరువాత వానితో కుడుములు చేసి విఘ్ననాయకునికి నివేదన చేస్తారు. ఆ దినము నుండి పెండ్లి పనులు ప్రారంభిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ముత్తైదువులచే గాక వధూవరుల చేత విఘ్నేశ్వరునికి పూజ గావించి, గోధుమలు గాని, పెసలు గాని, మినుములు గాని విసరించి, పదహారవ రోజున వాటితో కుడుములు చేసి విఘ్నేశ్వరునికి నివేదన చేస్తారు. ఈనాడే వీధి వాకిట పందిరి రాటను పాతిస్తారు. పిదప ముత్తైదువులు రోటియందు పసుపు కొమ్ముల నుంచి దంపుతారు. దీనిని 'పసుపు దంపుట' అంటారు. పసుపు మంగళకరమును, సౌభాగ్య చిహ్నమును అగుట చేత స్త్రీలందరు కలిసి పసుపు దంపుటయందు పాల్గొంటారు.

వివాహమునకు రెండు మూడు దినముల ముందుగా గృహాలంకారమును గావించి పెండ్లి పందిరి వేస్తారు. ఆ సందర్భంగా ఈ క్రింది పాట పాడుతారు.

'అయోధ్య పట్నాము ముస్తాబులయ్యేనా ఆకాశమంతా పందిళ్ళు భూదేవంత

ఆకాశమంత పందిళ్ళు భూదేవరుగులు గుచ్చిన ముత్యాలు తోరణాలు

గుచ్చిన ముత్యాలు తోరణాలు గట్టి గుమ్మాన ముత్యాల పందిళ్ళేసారు

గుమ్మాన ముత్యాల పందిళ్ళేసారు...

పట్టాపు రామయ్య పెళ్ళిళ్ళు నాడు మావిడాకు తోరణాలు

మావిడాకు తోరణాలు మట్టి అవిరేడు యాపాకు తోరణాలు

దేవాది దేవతల సాక్షింగానే పట్టావు రామయ్య పెళ్ళిళ్ళు"[10]

ఈ పాటలో ఆకాశమంతా పందిరివేసి భూదేవంత పీట వేసి గుచ్చిన ముత్యాలు తోరణాలు గట్టి గుచ్చని ముత్యాలు తలంబ్రాలు పోసి మహావైభవంగా వివాహము గావించినటుల చెప్పబడుట చేత పెళ్ళిళ్ళల్లో పందిరి కెంత ప్రాధాన్యమున్నదో తెలుస్తుంది. పందిరిని పచ్చి తాటాకులతో గాని, కొబ్బరి ఆకులతోగాని వేసి, పందిరి సంభాలకు అరటి చెట్టుమోదులను కట్టి, మామిడాకు తోరణాలతో పెళ్ళి పందిరి ఎంతో అందంగా అలంకరిస్తారు. అయితే నేడు పందిర్లు వేయడం పెద్ద పనితో కూడుకోవడం చేత వాటికి బదులుగా షామియానాల నుపయోగిస్తున్నారు.

వివాహమునకు ముందు వధూవరులను ఎవరియింటి వద్ద వారిని పెండ్లి కుమార్తెగను, పెండ్లి కుమారునిగను చేయుదురు. దీనితోనే వివాహ కార్యక్రమము ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ముత్తైదువలు వచ్చి శిరసునకు తైలమంటి సున్ని పిండితో నలుగుపెట్టి మంగళ స్నానం చేయిస్తారు. దీనినే 'తలంటు పోయుట' అందురు. తలంటిన పిదప నూతన వస్త్రములు ధరింపజేస్తారు. వధువును పెండ్లి కుమార్తెగా జేయునపుడు ముత్తైదువలు ఆమె పాదాలకు పసుపు పూసి పారాణినుంచెదరు. అనంతరము ముత్తైదువులు రోటియందు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-3 (1), March, 2017
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

పసుపు కొమ్ముల దంచిన పిదప కాట్నములను దంచుతారు. వీనినే 'పెండ్లి కాట్నములని' అంటారు. కాట్నము గావించుటనే 'ఉలూఖ పూజ' అంటారు. అనగా రోలును పూజించుట అని అర్థము. ఇది ఋగ్వేదకాలము నుండియు గృహజీవనమున గుర్తింపబడుచు వస్తున్నది. ముత్తైదువులందరు గూడి వధువు యింట వధువును, వరుని ఇంట వరుని పెండ్లి పీటపై కూర్చుండబెట్టి రోలు రోకలిని పూజించి, కుందెన యందువడ్లుగాని పుసుపుగాని వేసి దంచుతూ వివిధములగు పాటలు పాడెదరు. వీనినే కాట్నముల పాటలందురు. మచ్చుకు ఒకటి.

'పల్లాన పండినాయి అవి బ్రహ్మ బాసికాలు
రండమ్మ దంచుదాము రామకాట్నులు / కొట్నులు
అయ్యో... దంచి దంచి రోకళ్ళు ధరణిపైన జారేసి
మంచినీళ్ళ కెళ్ళిరమ్మా మగువలందరూ
మంచినీళ్ళ బావి దగ్గర అంచులేని ఆకుబుట్టె
ఎంచియెంచి పిలువరమ్మా పేరంటాళ్ళను
అయ్యో.. కొండమీద పండినాయి గోవర్ధనధాన్యాలు
పట్నమంత వారంత కొట్ల బోసినా
పుట్నమంత పండినాయి బుడమ సన్నధాన్యాలు
రండమ్మ దంచుదాము రామకాట్నులు / కొట్నులు
అయ్యో.. గట్టు మీద పండినాయి అవి గౌరి కుంకాలు
పట్నమంత వారంత కొట్ల బోసినా
మేడ్లోన పండినాయి అవిబ్రహ్మబాసికాలు
రండమ్మ దంచుదాము రామకాట్నులు / కొట్నాలు
అయ్యో.. కొండమీద పండినాయి జీలకర్ర సన్నాలు
రండమ్మ దంచుదాము రామకాట్నులు
దంచి దంచి రోకళ్ళు ధరణిపైన జారేసి
మంచినీళ్ళ కెళ్ళిరమ్మా మగువలందరూ
మంచినీళ్ళ బావి కాడ అంచులేని ఆకుబుట్టె
ఎంచియెంచి పిలువరమ్మా పేరంటాళ్ళను
ఒకరి ఒకరి కొప్పులోన గుప్పుడేసి మల్లెపూలు
సదాశివుని కొప్పులోన సన్న జాజాలు పల్లాన [11]

ఈ సందర్భంగా పాడుకొనే మరోపాట.

'సువ్వీకస్తూరిరంగా సువ్వీ కావేటి రంగా
సువ్వీ శ్రీమకాలింగ (మహాలింగ) చంద్రరావే సువ్వీ
జాజికర్ర పెట్టెలోన సేరి సుక్కబొట్టుపెట్టి - సువ్వీ సువ్వీదంచరమ్మ పడతులేడుగురు
తుమ్మముల్లు రోలు జేసి తుమ్మెడొడ్లు వాయి గలిపి - సువ్వీ సువ్వీదంచరమ్మ పడతులేడుగురు
పల్లాన పండినాయి వరిబెమ్మ బాసికాలు - పాడుకొని దంచరమ్మ పడతులేడుగురు
కొండమీద పండినాయి గోవర్ధనధాన్యాలు - పాడుకొని ధంచరమ్మ పడతులేడుగురు
ఒకరి ఒకరికొప్పులోన బారిడేసి మల్లెపూలు - సదాశివని కొప్పులోన సన్న జాజులు
మేనమామ తెచ్చినాడు మేలిమైన పట్టుసీర - సెంగు విడిచి కట్టరమ్మ సెలియలేడుగురూ"[12]

పై రెండు పాటలను బట్టి వధూవరులిరువురిని ఎవరి యింటి వద్ద వారిని పెళ్ళికూతురినిగా, పెళ్ళికూమారునిగా చేయునపుడు ముత్తైదువులు వచ్చి రోటిలో ధాన్యం పోసి దంచడం ఆనవాయితీ అని తెలియుచున్నది. అంతే గాకుండా అమ్మాయి మేనమామ బట్టలు పెట్టి అమ్మాయిని పెళ్ళి కూతురిని చేయడం కూడా ఆచారంగా ఉందని తెలుస్తుంది. ముందుగా తల్లిదండ్రులు తమ బిడ్డను పెండ్లికుమార్తె / పెండ్లి కుమారునిగా చేసిన పిదప గ్రామంలోని బంధువులు వారిని వారిండ్లకు పిలుచుకుపోయి నలుగుపెట్టి స్నానం చేయించి పెండ్లి కుమార్తె / పెండ్లి కుమారుని చేయు ఆచారము కలదు.

ఈ సందర్భముగా పాడుకొనే పాట.

'నలుగాడు పెండ్లి పడుచా – నలుగాడవమ్మా

దేవానదేవతలు తెచ్చినా నలుగు – మీ యింట పెద్దాలు చేసినా నలుగు

విష్ణు ఈశ్వరుడు ఇచ్చినా నలుగు – మీ ఇంట పెద్దాలు చేసినా నలుగు

తాతాల వాకిట్ల పీటాలు వేయించి – తాతాల రామయ్య చేయించే నలుగు

పెదనాన్న వాకిట్ల పీటాలు వేయించి – పెదనాన్న చేయించె నలుగు.[13].

ఈ పాటలో ఎవరెవరు తీసుకువెళ్ళారో వారి పేర్లను పేర్కొంటూ. వారి ఇంటి ముందు పీటను వేయించి నలుగు పెట్టినట్లుగా వర్ణించబడింది.

పెండ్లి కుమార్తెను, పెండ్లి కుమారుని చేసిన పిదప కులదేవతను పూజించు ఆచారము కలదు. శ్రీ మహాలక్ష్మీని కులదేవతగా భావించి ప్రతి శుభకార్యమునకు ముందు పూజించుట మన సంప్రదాయం. ఈ సంప్రదాయము అన్ని కులముల వారి యందు కలదు. కుమ్మరి చిన్న చిన్న మట్టి కుండలను తయారు చేసి వాని మీద వివాహమునకు సంబంధించిన వివిధములైన చిత్రములను మనోజ్ఞముగా రంగులతో లిఖించి యుంచును. వీటినే "ఐరేని కుండలు' అని అంటారు. ఐరేణిని లక్ష్మిదేవిగా భావించి పూజించుట వలన ముత్తైదువులు మంగళవాద్యములతో కుమ్మరింటికి వెళ్ళి తగిన బహుమానములు నిచ్చి వాటిని (ఐరేణికుండలను) పెళ్ళింటికి తీసుకొని వస్తారు. ఆ సందర్భముగా పాడే పాట ఇది.

'కుమ్మరి ఓయి కుమ్మరి – రావోయి కుమ్మరి రాజా

లక్ష్మికళ్యాణమే వైభోగమే – గౌరి కళ్యాణమే సౌభాగ్యమే

మాపిడికి మా ఇంట్లో బొమ్మ పెళ్ళిళ్ళు – రావోయి కుమ్మరి రావో కుమ్మరి

పిలిచాము మాపనులు విన్పిస్తాము ॥లక్ష్మి॥

అమావాస్యలగ్గాలు అందొచ్చినాయి లక్ష్మి పున్నమిలగ్గాలు పూనొచ్చినాయి

మును పుళ్ళు మున్నూరు ఓరి కుమ్మరి – పొప్పెడ పాకాన పానలా లక్ష్మి

ఈ విధంగా కుమ్మరింటి నుంచి అవిరేణి కుండలను తీసికొని వాటిని ఇరువురు మోయుచుండగా నాలుగు ప్రక్కలనలుగురు క్రొత్త గుడ్డలతో అవిరేణులకు నీడను పట్టి వానిని భద్రంగా తమ గృహమునకు తెచ్చి, వాటిని దేవునింటిలో అడుగున ధాన్యమును పోసి, ధాన్యముపై పొందుగ నిలిపి ఐరేణి కుండలకు వెండిలేక బంగారు నగలను తగిలించి కుండలపైన మూకుళ్ళలో ఆముదమును పోసి ప్రత్తితో చేయబడిన వత్తిని వేసి వెలిగించెదరు. దీనినే 'మహాలక్ష్మి నావాహన' చేయుట అంటారు. బాసికములను ఐరేణి కుండల కెదురుగా పెట్టి పూజిస్తారు. లక్ష్మిదేవిని ఆవాహనము చేసిన పిదప.

'జయ మంగళం నిత్య శుభ మంగళం

దివ్యాంబరములు గట్టి దీపాల వెలుగున

నవ్వుచు మహాలక్ష్మి నాట్యమాడా

ఇలవేల్పు నీవు వెలసితివి మా ఇంట [15]

అంటూ లక్ష్మిదేవిని పూజించి, తమను కన్న బిడ్డలవలె కాపాడి రక్షింపుమని హారతులనిచ్చెదరు. 'ఐరేని గొనివచ్చి రైదువల్ పాటలు పాడుచు శుభవేల వేడుకలర' 54 అని విజయవిలాసమునందు పేర్కొనబడియుండుటను బట్టి వివాహము నందు ఐరేణి కుండల యొక్క ప్రాముఖ్యత వెల్లడియగుచున్నది. లగ్నమైన పిమ్మట వధూవరులచే అవిరేణికి మొక్కించెదరు. కులదేవతను ప్రతిష్ఠించిన తరువాత ముత్తైదువలందరు కలసి మంగళ వాయిద్యములతో కంసాలి యింటికి వెళ్లి మంగళ సూత్రాన్ని, మట్టెలను తీసుకొని వస్తారు.

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-3 (1), March, 2017
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

పూర్వకాలంలో వివాహాలను ఎక్కువగా ఆడపెళ్లి వారింటిలో జరిపేవారు. కనుక మగపెళ్లి వారు ఆడపెళ్లి వారింటికి తరలి వెళ్లేవారు. ఈ విషయాన్ని తెలియజేసే ఈ పాటను చూడండి.

"చీతమమ్మ నడగటానికి రామూలెలతారు – పండూ జిల్లెడి సాయ చీతమ్మసాయ

అల్లో నేరేడి పండు రామూలాసాయ – చీతమ్మ పలవరస రాతా (వ్రాత)లున్నాయీ

రామునీ మోకాన్ని సోబూ (శోభ)లున్నాయి – చీతాని రాముడ్కి పెళ్లూసేయాలా

హామాటావిన్నాడు తానూ జనకుండూ – దన్ను వొంచిన వోర్కె చీతనూ చేతానూ

హరిదంచువంచాల చీతను సెయ్యాలా – అటువైతే చీతను పెళ్ళూ చేతామూ

ఒచ్చీనా పెద్దాలు తిరిగెళ్ళి నారూ – ఒంగీ దణ్ణము లెట్టి ఒందనము సేసే

ఇన్నార రామయ్య ఇన్నార మీరూ – మునిపల్లి పట్నాలు మీరు వెల్లాలా

అరిదంచు వొంచండి చీతనూ చేతారు – పేమాతో పెళ్ళాడి రావయ్య తండ్రి

చీతాను చేపట్టి వయోజ్జకి రావయ్య [17]

సీతారాములు పరంగా పాడుకొనే కల్యాణం పాట ఇది. పూర్వకాలం రాజవంశీయులు తమ కుమార్తె పెళ్ళీడుకొచ్చాక స్వయంవరాన్ని ప్రకటించి గెలిచినవారితో లేదా నచ్చిన వారితో వివాహం జరిపించేవారు గనుక పెళ్ళి కూతురింటికి పెళ్ళికొడుకులు వెళ్ళడం జరిగేది. అదే ఇప్పటికీ కొనసాగుతున్నప్పటికిని నేడు కొన్ని చోట్ల మగ పెళ్ళి వారి అభిమతం ప్రకారం వివాహానికై ఆడపెళ్ళి వారు మగపెళ్ళి వారింటికి తరలి రావడానికి కూడా జరుగుతుంది. వివాహానికై వచ్చిన మగపెళ్ళి వారిని ఆడపెళ్ళివారు మంగళ వాయిద్యాలతో రావడం కూడా జరుగుతుంది. వివాహానికై వచ్చిన మగపెళ్ళి వారిని ఆడపెళ్ళివారు మంగళ వాయిద్యాలతో ఊరి పొలిమేర దగ్గర ఎదుర్కొని విడిదింటికి తీసికొని వెళ్తారు. ఇలా విడిదింటికి వచ్చుటకు మునుపువారు

(పూర్వకాలంలో రవాణా సౌకర్యాలు పెద్దగా లేకపోవడం వలన ఎడ్ల బండ్లపై) ప్రయాణం చేసి అలసి పోవడం చేత కొంత సేపు ఏ చెట్టు కిందనో విశ్రమించేవారు. ఆ విషయాన్ని తెలియజేసే గేయమిది.

'పచ్చరో కట్టకాడ పెద మర్రికాడ

పెంపుగా దిగినారు పెండ్లి వారంత

జోడు కంబళు రెండు జాడించి పరిచి

రత్న కంబళు రెండు రమణతో పరిచి

కూరిమితో రాముణ్ణి కూర్చుండబెట్టి"[18]

వియ్యాలవారికి మర్యాదలు జరిపి వారిని ఊరేగించుకొంటూ విడిదింటికి తీసికొని వచ్చిన సందర్భంగా పాడుకొనే పాట.

'ఆటగుర్రా మొకటి అంసాలా రథ మొకటి ॥2॥

రథముపై కూర్చున్న వారెవ్వరూ

వారున్న దవ్వల భద్ర చతిరికులు

రథముపై కూర్చున్న రఘురాముడడిగో

మంగాళం మంగాళం – జయ జయ మంగళం నిత్య శుభ మంగళం

పార్వతమ్మా మంగాళం మంగాళం

బిళ్ళాలు వంకీలు బిరువైన మొలతాడు ॥2॥

డాకాయి మొగము సన్నాయి కాళ్ళు

మడమెట్టి పిళ్ళాలు నడుము కొడ్డాణము

పసుపు తానా బట్టు సీత నీకిదిగో ॥మంగళం॥

బంగారు పళ్ళెములు భామలిద్దరు గూడి ॥2॥

పచ్చని పందిట్లో పతక మొకటి

జయ జయ మంగళం నిత్య శుభమంగళం

పార్వతమ్మా మంగాళం మంగాళం[19]

కాశీయాత్రకు వెళ్తున్న వరుడిని సన్యాసాశ్రమం స్వీకరించవద్దని తన కుమార్తె నిచ్చి వివాహం చేస్తానని, గృహస్థాశ్రమాన్ని స్వీకరించమని బతిమాలుతూ పాడే పాట ఇది.

"కౌసల్య అల్లుడు గోవిందరామ – కాశీ పైనా మనె గోవిందా

దేవిడి దిగకుండ గోవిందరామ – మహారాజునిలుచుండే గోవిందా

కాశికి వెళ్ళొద్దు గోవిందరామ – మాకన్యనిస్తాము గోవిందా

అప్పుడు రాజఋషి గోవిందరామ – మహారాజుతో చెప్పి గోవిందా

తగువు ధర్మము కాదు గోవిందరామ – గడ్డంబు పట్టుకొని గోవిందా

బెల్లపుగడ్డ పెట్టి గోవిందరామ – బ్రతిమాలసాగెను గోవిందా

కాశివెళ్లావద్దు గోవిందరామ – మాకన్యను యిస్తాము గోవిందా[20]

కాశీయాత్ర విరమణానంతరం కన్యాదాత వరుడి కాళ్ళు కడిగాక తల్లి మధుపర్కముల నిచ్చునప్పుడు పాడుకొను పాటయిది.

'లగ్గానికొచ్చారు రాజేంద్రబోగే – లగ్గాని కొచ్చారు రాజేంద్రబోగే

కదిలొచ్చినాసామీ కల్లేణామందు – కదిలొచ్చినాసామీ కల్లేణా మందూ

కాల్లూ కడిగి అల్లుడికి కట్నామే మిచ్చూ – కాల్లూకడిగి అల్లుడికి కట్నామే మిచ్చూ

ఎండుత్తర దంజాలు ఏళ్లుంగరాలు – పైడుత్తర దంజాలు పట్టూసాలువలూ

రావయ్యా రగురామ రావయ్యా రామా – వచ్చీమా చీతమ్మ మెళ్లో సూత్రాలు కట్టూ ॥2॥

సుముహూర్త సమయమున జీలకర్ర, బెల్లం కలిపిన మిశ్రమాన్ని వధూవరులిరువురు ఒకరి శిరస్సుపై మరొకరు ఉంచుతారు. కారణం జీలకర్ర ముదిమిరాకుండా చేసి యవ్వనమును పోషించుటకు వలనను, బెల్లము పవిత్రము, సుగుణోపేతమైన దగుట చేతను జీలకర్ర బెల్లముల మిశ్రమాన్ని విశేష శ్రేయప్రాప్తి కలుగుటకై శిరస్సు నందుంచుతారు. జీలకర్ర, బెల్లముల మిశ్రమాన్ని శిరస్సులపై నుంచునపుడు వాటిపై కాడి ద్వారా (చెక్క రంధ్రంలోంచి) ఒక చుక్క పాలు, ఒక చుక్క నీళ్ళు పడేటట్లు చేస్తారు. ఎందుకనగా పాలు నీళ్లవలె భార్యభర్తలు కలసియుండాలనే ఉద్దేశ్యముతో.

'జీలకర్ర బెల్లంబు గోవిందా – ముని చేతికి యిచ్చె గోవిందరామ

కన్యశిరసున బెట్టించె గోవిందా – కన్యచేతా వారు గోవిందరామ

జీలకర్ర బెల్లంబు గోవిందా – ముని శిరస్సుపై నుంచిరి"

ఒకరి శిరస్సుపై మరొకరు జీలకర్ర బెల్లం కలిపిన మిశ్రమాన్ని ఉంచుకొనిని పిదప, వధూవరులిరువురి మధ్యనున్న తెరను తొలగించెదరు. అపుడు వారిరువురు ఒకరినొకరు చూచుకొందురు. పిదప వరుడిచే వధువును ఆశీర్వదింపజేసి, వధువుచే వరుడి కాళ్ళకు దణ్ణం పెట్టిస్తారు. ఆ తరువాత వధువును గంపలో నుంచి పైకి లేపి మధుపర్కాలు (తెల్లని బట్టలు) కట్టించి, పదహారు లేదా పద్దెనిమిది జ్యోతులతో మంటపానికి తీసుకుని వచ్చి వరుడి ప్రక్కన పీటపై కూర్చుండబెడతారు.

మంగళసూత్రాలకు (పుట్టింటి వారిది, అత్తింటివారిది) పూజ చేయించి, సౌభాగ్యము రెండింతలగునను నమ్మకముచే వాటిని ముత్తైదువచే ముట్టించి, ఆ పిదప వరునిచే మూడు ముళ్ళు వేయించుట ఆచారము. దీనికి సంబందించిన పాటలు.

"పుణ్యవనితల చేత పుస్తె ముట్టించి – సన్నుతాంగికి కట్టె సదయరాముడు"

"మంగళాసూత్రమ్ములూ రామచంద్రులు వేడుకతో

నవ్వుచు శ్రీరామచంద్రూలు తాను సీత మెడను గట్టెను'[21]

వధువు మెడలో వరుడు తాళి కడుతుండగా వారిని

పేరంటాళ్ళు పురాణదంపతులుగా వధూవరులను భావించుకొని ఈ పాట పాడతారు.

"ఆనంద మానందమాయెను – మనరాముడు పెండ్లికొడుకాయెను

ఆనందమానందమాయెను – అల జానకి పెండ్లి కుతురాయెను

ఘనుడౌ జనక భూపాలుడు – కన్యాదానము చేసె గుణశీలుడు

పొంగుచు మంగళసూత్రము రాముడుతా

గొబ్బునగట్టె క్షేమముగను వేడ్కతోడనేడు ॥ఆనంద॥[22]

ఈ విధంగా వివాహంలో తలంబ్రాలు పోసుకొనుట ఒక ఆచారం దాని వలన ఆయుర్వృద్ధి కలుగుటయే గాక కొత్తదనము సిగ్గుదొంతరలు తొలగిపోయి ఇరువురు మధ్య సఖ్యత ఏర్పడుటకు దోహదపడుతుంది.

'రంగైనా ముత్యాలు రత్నాలు – సీతారాములు వారి తలంబ్రాలట' అను పాటను బట్టి పూర్వం ముత్యాలను, రత్నాలను తలంబ్రాలుగా ఉపయోగించెడివారని తెలియుచున్నది. నేడు ఆర్థిక స్థోమత ఉన్నవారు పసుపు కలిపిన బియ్యంలో పూలు, ముత్యం, పగడం, కలిపి తలంబ్రాలుగా ఉపయోగిస్తున్నారు. లేని వాళ్ళు పసుపు కలిపిన బియ్యాన్ని తలంబ్రాలుగా వాడుచున్నారు. ఈ తలంబ్రాలు పోయునప్పుడు పురుషాధిక్యతను తెలియజేస్తూ

ముందుగా వరుడు వధువు శిరస్సుపై తలంబ్రాలను పోసిన తరువాతనే వధువు వరుని శిరస్సుపై పోయాలి. ఈ విధంగా మూడు సార్లు వేయడం జరుగుతుంది. ఆ తరువాత ఎవరు ముందు వేసినా పర్వాలేదు.

'పళ్లెముతో తలంబ్రాలు గోవిందరామ – ఋషిచేత బట్టించి గోవిందా

మూడు దోసిళ్లయిన గోవిందరామ – ముగుద శిరసున నుంచి గోవిందా

కన్యచేతావారు గోవిందారామ – కాంతుని శిరసున నుంచి గోవిందా"[23]

ఇలా వధూవరులు ఒకరిపైనొకరు తలంబ్రాలు పోసుకోవడం వారికే గాక చూచువారికి ఆనందాన్ని ఉత్సాహాన్ని కల్గిస్తుంది. అనంతరం వధూవరులచే పూలదండలు ఒకరిచే ఒకరికి వేయిస్తారు. ముందుగా వధువు వరుని మెడలోను, ఆ తరువాత వరుడు వధువు మెడలోను పూలదండలు వేస్తారు. ఆ తరువాత వధువు తల్లిచే గాని, సోదరిచే గాని వధూవరులకు హారతి ఇప్పిస్తారు.

అనంతరము చదివింపులు, బంధుమిత్రులు తాము తెచ్చిన కట్నకానుకలను వధూవరులకు చదివిస్తారు. ఆ తరువాత వధూవరులు వస్త్రములకు (వరుని ఉత్తరీయాన్ని వధువు చీరచెంగును) బ్రహ్మముడి వేసి, ప్రేత పిశాచముల గాలితగుల కుండుటకై మామిడాకును మంత్రించి, పసుపు దారముతో వధూవరులచేతులకు రక్షాబంధనము కట్టిస్తారు. దీనినే 'కంకణము కట్టుట' అంటారు.

వివాహమైన తరువాత వరుడు వధువుతో బాటు వివాహసంబంధమైన ప్రధాన హోమం నాచరించును. ఇప్పటి నుండియే వధూవరులకు అగ్నిహోత్రాది కర్మలు ప్రారంభమగును. పిదప సత్సంతానము కొరకు, తనతో పాటు భార్య కూడా వార్ధక్యమును అనుభవించుట కొరకు వరుడు వధువు హస్తమును గ్రహించును. దీనినే **'పాణిగ్రహణమని'** అంటారు. వధూవరులు మంగళకరమైన జీవితాన్ని గడుపుటకై లాజహోమమునందు సూర్య, వరుణ, ఆర్యమ పూషాగ్ని, ప్రజాపతి దేవతలకు పేలాలను ఆహుతిగావిస్తారు. వధువు సోదరుని నుండి వరుడు లాజలను గ్రహించి, ఘృతముతో బాటు వానిని హోమగుండమున వేయును.

వరుడు తనతో బాటుగా వధువును ఏడడుగులు నడిపించుటయే సప్తపది. ఇదిలేని వివాహము అసంపూర్ణము. నూతన వధూవరుల మధ్య విడదీయరాని సంబంధము ఏర్పరచుటయే దీని ముఖ్యలక్ష్యము. ప్రాపంచిక పారమార్థిక శ్రేయస్సునకు ఒండొరులు పాటుపడుట, పుత్రసంతానము లేని పక్షమున దంపతులలో ఎవ్వరు జీవించి యుండినను మరణించిన వారికి శ్రాద్ధ కర్మలు గావించుటను ఎరుకబరుచుట సప్తపది ఉద్దేశ్యము. [24]

'సప్తపాదములపుడు తొక్కించి అరుంధతి చూపించిరి'[25] అనుటచే **సప్తపది** తరువాత అరుంధతీ దర్శనము చేయిస్తారని తెలుస్తుంది. అరుంధతి వశిష్టుని భార్య. మహా పతివ్రత. ఆమె వలె కీర్తి ప్రతిష్ఠలు పొందవలెనను ఉద్దేశ్యముతో అరుంధతి దర్శనము గావింతురని ఊహించవచ్చు. దీనితో వివాహ కార్యక్రమము ముగిసినట్టే.

అయితే ఈనాటి వివాహాలు ఎక్కువగా పగటి పూట జరుపబడుచుండుటచే అరుంధతీ నక్షత్రం కనబడలేదని అనుట అశుభం గనుక వధూవరులు కనిపించినట్లుగా చెప్పడం జరుగుతుంది.

పెండ్లిలో చివరి తంతు **నాగవల్లి**(నాకబలి). పూర్వం పెండ్లి ఐదురోజుల జరుపబడుకాలంలో నాలుగవరోజున నాగవల్లిని జరిపిస్తారు. కాని ఇప్పుడు వివాహములు ఒక్కరోజే జరుపబడుచుండుటచేత వివాహానంతరము ఈ తంతు నామమాత్రంగా మంటపములోనే జరుపబడుతున్నది. అందువలన నాగవల్లి అనంతరం అరుంధతీ దర్శనం గావిస్తున్నారు. వివాహానంతరం వధూవరులు దేవతాపూజాదికమును గావింపవలెనని నియమముండుట చేత 'నాక బలి' అను విధిని పాటించు సంప్రదాయం ఏర్పడినది. నాకమనగా స్వర్గము. స్వర్గములోని ముప్పది మూడుకోట్ల దేవతలను పూజించి వారి ఆశీర్వచనములను పొందుటయే నాకబలి ఉద్దేశ్యము.

నాగవల్లికి ముందు అల్లుడు అలిగినపుడు కూతురి సుఖమును ఆశించి అతని అలుకను మామగారు తీర్చుటకై అతడు అడిగిన వాటిని శక్తికొలది ఇవ్వడం జరిగేది. ఆ సందర్భముగా పాడుకొను పాట ఇది.

"మూడు వేలిచ్చేదాము – ముద్దుటుంగ్రం పెట్టేదాము

రావయ్యా పెళ్లికొడకా విడిదిలోనికి

మూడువేలు నాకూ ఒద్దూ – ముద్దుటుంగ్రం నాకు ఒద్దూ

రానండీ మావయ్య గారు విడిదిలోకి

నాలుగువేలిచ్చేదాము – నాగపల్లకీలెట్టేదాము

రావయ్యా పెళ్లికొడకా విడిదిలోకి

నాలుగవేలు అక్కర్లలేదు – నాగ పల్లకీ లక్కర్లేదు

రానండీ మావయ్య గారు విడిదిలోనికి

అయిదువేలిచ్చేదాము – అడ్డ సొంబులెట్టేదాము

రావయ్యా పెళ్లికొడకా విడిదిలోకి

అయిదు వేలు నాకు ఒద్దూ – అడ్డ సొంబూలు నాకు ఒద్దూ

రానండీ మావయ్య గారు విడిదిలోకి

ఆరువేలిచ్చేదాము అడ్డ – హంసాలెట్టేదాము

రావయ్యా పెళ్ళికొడకా విడిదిలోకి

ఆరువేలు అక్కరలేదు – అద్ద హంసాలక్కరలేదు

రానండీ మావయ్యగారు విడిదిలోకి

ఏడు వేలిచ్చేదాము – ఎల్లగుఱ్రాలంపేదామూ

రావయ్యా పెళ్ళికొడకా విడిదిలోకి

ఏడు వేలు నాకు ఒద్దు – ఎల్ల గుఱ్రాలసలే వద్దూ

రానండీ మావయ్యగారు విడిదిలోకి

ఎనిమిది వేలిచ్చేదాము – ఎండి పళ్లాలెట్టేదాము

రావయ్యా పెళ్ళికొడకా విడిదిలోకి

ఎనిమిది వేలు నాకు ఒద్దూ – ఎండి పళ్లాయి నాకు ఒద్దూ

రానండీ మామయ్యగారు విడిదిలోట

తొమ్మిది వేలిచ్చేదాము – తొక్కుడు బళ్లూ పెట్టేదామూ

రావయ్యా పెళ్ళికొడకా విడిదిలోకి

తొమ్మిది వేలక్కరలేదు – తొక్కడు బళ్లూ అక్కరలేదూ

రానండీ మావయ్య గారు విడిదిలోకి

పదివేలు ఇచ్చేదాము – పందిరి కోళ్ళమంచామిత్తా

రావయ్యా పెళ్ళికొడకా విడిదిలోకి

పదివేలు నాకు ఒద్దూ – పందిరి కోళ్ళ మంచామొద్దూ

రానండీ మావయ్యగారు విడిదిలోకి

లచ్చవేలిచ్చేదాము – లచ్మీకాంతానిచ్చేదామూ

రావయ్యా పెళ్ళికొడకా విడిదిలోకి

లచ్చవేలు కావాలి నాకు – లచ్మీకాంతం కావాలి నాకు

పదండి మావయ్యగారు విడిదిలోకి”

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-3 (1), March, 2017
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

పెళ్లిలో కట్న కానుకలకు ఎంత ప్రాధాన్యమున్నదో ఈ పాటలో

వివాహానంతరం వధూవరులను ఊరేగిస్తారు. ఊరేగింపు అనంతరం ఇంటికి వచ్చిన పెండ్లికుమారుడినుద్దేశించి అత్తింటివారు ఈ నివాళి పాటను పాడతారు.

'వేపలే కొమ్మలు హెచ్చైన మేడలు

ఏతట్టు చూచినా పంజరాలు

పంజరాల పాపమ్మ కొక్కడే కొడుకమ్మా

నిలుసున్న వాడురా తులసమ్మకు

జయ జయమంగళం నిత్య శుభ మంగళం

పార్వతమ్మా మంగాళం మంగాళం

ఊరు తిరిగొచ్చాడు ఊరాపెళ్ళి కొడుకు

కాలు దొక్కినాడు కంకణం కట్టు

కాలు దొక్కినాడు కంకణం కట్టీ

బాల పెళ్ళి కొడుకు బాయించినాడు

బాయించుకొన్నాడు బాసికము కట్టీ

కాలు దొక్కీనాడు కంకణం కట్టూ

ఊరు తిరిగొచ్చాడు ఊరా పెళ్ళికొడుకు"[26]

అంటూ పాడి, నివాళి యిచ్చి ఇంటిలోనికి తీసుకొని వెళ్తారు.

వివాహానంతరం వధూవరులను విందునకు తీసుకొని వెళ్తారు. ఈ విందునే 'బూజంబంతి. 'బువ్వంబంతి' అని అంటారు. పూర్వం వివాహాలు ఎక్కువరోజులు జరిగెడివి గనుక ఆ రోజుల్లో నాలుగవనాటి రాత్రి బంధువులందరు వేడుకగా బంతులు తీరి భుజించడం జరిగేది. అందువలన దీనికి బువ్వంబంతి అను పేరు వచ్చింది. ఈ సందర్భంగా వధువు తండ్రి వియ్యాలవారికి ఎటువంటి లోపము జరుగకుండా సమస్త సౌకర్యాలను సమకూర్చి షడ్రసోపేతమైన విందు భోజనము ఏర్పాటు చేసి వారిని సంతృప్తులను గావించును. ఎందుకనగా వివాహ సమయమున లోటుపాట్లు జరిగితే తమ బిడ్డ అత్తవారింట మాట పడవలసి వస్తుందని, ఆమె కష్టపడునని తలంచి వియ్యాలవారికి అధిక గౌరవ మర్యాదలు చేస్తారు. అయితే నేటి కాలమున వివాహానంతరం విందు

భోజనమునే "బువ్వం బంతి' గా గ్రహిస్తున్నారు.

'పచ్చంగ కట్టిన పందిళ్ళ కింద

కృష్ణున కమర్చిరీ బూజమ్ము బంతి

తాళమేళముల సంగీతాలవారు

సత్య భాగవతులు తమలు కూర్చుంగ్రు

తోట యరిటాకులే పయిడి పళ్ళెములు

వెండిగిన్నెలతోను వెలసె బూజమ్ము

రాజనాలన్నమూ కందిపప్పులునూ

వెన్న గాచిన నేయి వెలసె బూజమ్ము

అరవై కూరలూ పిండి వంటలునూ

అమర విద్వాంసులతో అమరె బూజమ్ము[27]

ఇలా విందు భోజనాన్ని ఏర్పాటు చేసి వధువు పక్షంవారు వియ్యాలవారిని విందునకాహ్వానించి,

'ఎక్కడ దొరికినారు, యింత చక్కని వియ్యాలవారు

నెయ్యంతా నేడే తీర్థం వలె త్రాగినారు

హెచ్చైన పప్పులు వేస్తే మెచ్చరమ్మా యేమో వీరు

సన్న బియ్యపన్నము వీరు ఎన్నడు ఎరుగరేమో

ఎన్నిసార్లు వడ్డించిన యింకా తెమ్మని అడిగేరు

అరిటాకుల అలవాటులేక చిరుగులు చేసుకున్నారు

పెరుగుపాలు కలగలిపి జుఱ్ఱు జుఱ్ఱు జుఱ్ఱేరు

పప్పు కూరలు వద్దు. పచ్చళ్లే తెమ్మనేరు

చెప్పుకుంటే సిగ్గుచేటు, గొప్ప వారని వీరికి పేరు.[28]

అంటూ వరుని పక్షంవారిని పరిహాసము చేస్తారు. అపుడు మగపెండ్లివారు కూడా ఆడపెండ్లి వారిని విందు నందు ఇవి లేవు అవి లేవని హేళనచేస్తూ

"ఆహాహా పెండ్లి వారింట అందమయిన విందుగా

ఓహోహో యొపుగ జెప్పవహవ్వా బడాయనేగా

ఉప్పులేదు పప్పులోను – ఉడకలేదు కూరలు

చప్పని కమ్మని సున్ని – చప్పిడి మెతుకులేగా

ఆజ్యమా చెవులోని ధారయే – అప్పుడమైనా లేదాయె

ఎన్నికైనా పిండి వంట – యేనాడయిన లేదాయె

చింతపండు లేని చారు – క్షీరములేని పాయసము

చిత్రమయిన చిత్రాన్నము – పాత్రమంతా నిండేగా

నిమ్మాకు నీరు మజ్జిగ – నెన్నికగా వడ్డించిరి

కమ్మ పెరుగైన లేదు – కలికముకైనాలేదుగా"[29]

అంటూ ఇరు పక్షాలవారు ఒకరినొకరు హేళన చేసికొనుచు ఉత్సాహాన్ని, ఆనందాన్ని పొందడం జరుగుతుంది. తరువాత వధూవరులను మంచంపై కూర్చోబెట్టి బంతులాటాడిస్తారు.

ఎందుకంటే జీవితం బంతులాట వలె ఇరుప్రక్కల సహకారంతో కొనసాగుతుందని, సుఖదు:ఖాలను సమానంగా చూడాలన్న ఉద్దేశ్యముతో వధూవరుల చేత పూల బంతులాడిస్తూ..

'తూరుపు ఈదిల్లోను తూర్పు గదుల్లోను తూగుటయ్యాలలోను

సీతారాములవోరు సిరిబంతులాడేరంట

మంగళమో జయ మంగళము చుబా మంగళమో

దచ్చన్నా ఈదుల్లోను – దరణి పీటల మీద

సీతారాములవోరు సిరిబంతులాడేరంట ॥మంగళ॥

పటమటా యీదుల్లోను పట్టీ (పట్టు) బాలీసుల మీద

సీతారాముల వోరు సిరిబంతులాడేరంట ॥మంగళ॥

ఉత్తారి ఈ దిల్లోను ఉన్ని బాలీసుల మీద

సీతారాముల వోరు సిరిబంతులాడేరంట ॥మంగళ॥

మంగాళఆరతమిదిగో మారంగైనా రాముల వారికి

మంగాళఆరతమిదిగో మారంగైనా చీతమ్మ తల్లికి ॥మంగళ॥[30]

అంటూ పాట పాడతారు

ఇటువంటిదే మరొక పాట.

'ఇశాఖ పట్నాన ఈదిగుమ్మాన వింత రాచకొడుకు బంతులాడేను

వింతరాచ కొడుకు బంతులాడేను ఆ బంతి ఎల్లి సభల్లో పడితే

ఈ బంతి ఎవరీ దాని ఇవరామడిగిన రాజు

గోల్కొండ వారి గొలుసుల్లా బంతి

పాలకొండా వారి పచ్చల్ల బంతీ

నీలకొండా వారి నీలంపు బంతీ

శ్రీకాకుళం వారి చిత్రాల బంతీ

బొబ్బిల్లి వారిది బంగారు బంతీ"[31] ఈ పాటలో బంతిని గురించి వర్ణించడం జరిగింది.

**ఇంకొకపాట:**

'చెండ్లాటకూ పిలసినా రాడేమే చెలి

మచ్చామై జలధిలో సొచ్చి వేదాములు

ఇచ్చినా పరబ్రహ్మ యిడవడమే చెలి ॥చెండ్లాట॥

ఊర్మిళా దాసుడై కోర్కులొసంగుచు

ఎంకట కృష్ణుడై వెలసినాడే చెలి ॥చెండ్లాట॥

పెళ్ళి కుమారుడిని హేళన చేస్తూ పెళ్ళి కుమార్తెనుద్దేశిస్తూ

"బంతులాడేనే పూలబంతులాడెనే మేల్

బంతులాడెనే యెగసి గంతులాడెనే

బుఱ్ఱముక్కు తొఱ్ఱినోరు బఱ్ఱగొంతు పెండ్లికొడుకు

చిఱ్ఱు ముఱ్ఱు లాడి పూలచెండు లాడెనే

కొంగ కాళ్లు వంగువేళ్లు బొంగజొల్లు పెండ్లికొడుకు

చెంగు చెంగు మనుచు పూల చెండులాడెనే

గోరు లెల్ల చేయితీట గీరుకొనుచు పెండ్లికొడుకు

పార పండ్లు తెరచి పూల చెండు లాడెనే

గోచిపాత వీడ జనులు చూచి నవ్వ పెండ్లి కొడుకు

పాచిపండ్ల తోడ పూలచెండు లాడెనే

సిగ్గుపడుచు పెండ్లి బాలమ్రొక్కి మ్రొక్కి చేతులెత్త

సిగ్గు యింతలేక పూల చెండులాడెనే"[32]

ఇలా ఈ వాతావరణం వధూవరులకే గాక చూచు వారికందరికిని వినోదాన్ని కలిగిస్తోంది.

ఇక అత్తవారింటికి పంపించుటకు ముందు వధువునకు ఒడినింపుతూ ఈ పాట పాడతారు.

వడి చీర గట్టిరి వడి బియ్యముంచిరి

కందవడి బెట్టిరి బొమ్మవడి బెట్టిరి

తెల్లని వడిబ్రాలు శాంతవడి నింపిరి

వెండిగిన్నెయును దెచ్చి వెలది వడి నుంచిరి"[33]

– కంద దుంప పిలకలు వేసి అభివృద్ధి చెందినట్లుగా నీవును సంతానాన్ని పొంది అభివృద్ధి చెందుమని సూచిస్తూ కందదుంపతో ఒడిని నింపుతారు. ఈ విధంగా సౌభాగ్య ప్రదమైనవి, మాతృత్వద్యోతకమునగు మంగళకరమగు వస్తువులతో వధువు ఒడినింపి అత్తవారింటికి పంపు ఆచారము కలదు.

వధువును వరుడికి, అతని తల్లిదండ్రులకు అప్పగించు సమయంలో ముత్తైదువులు పాటలు పాడతారు. ఆ పాటలనే అప్పగింతల పాటలను అంటారు. మచ్చుకు ఒకటి చూద్దాం.

'దశరదాకొమరా వసుదేవా పుత్రుండు

దశరదా కొమరా వసుదేవా పుత్రుండు

కారు కారునదాటి కన్నెను పెండ్లాడితివా – తొమ్మిది నెల్లు నిను మోసి పండెండేళ్లా పెంచి

నీకప్పాగించితిమి ఒప్పుల్లా మన్నించీ – అగ్గిసాచ్చీగాను చీతనూ పెండ్లాడితివా

రాముని సేతిలో పాలు చీతాసేతిలో వోసి – సేతిలో సెయ్యేసి నీకప్పాగించితిమీ

నీ బారమేగానీ మా రారామిక లేదూ – దశరదా కొమరా వసుదేవాపుత్రుండా

సెయ్యా సెయ్యాను బట్టి సిటుగూనేళ్ళను బట్టి – కలకాలం మీరిద్దరు వర్థిల్లూసుండాలా

నీకప్పాగించితిమి ఒప్పుగా సూసుకో – నీ బారమేగాని మాబారామిక లేదు ॥దశ॥[88]

– సీతారాముల పరంగా పాడుకొనే పాటయిది. ఈ పాటలో తొమ్మిది నెలలు మోసి కనిపెంచిన కుమార్తెను భర్తకు అప్పగిస్తూ, తప్పులుంటే, క్షమించమని కోరుతూ ఇక నుంచి ఆమె భారం నీదేనంటూ తమ బిడ్డను అప్పగిస్తారు.

'అత్తవారి యింటీ కంపెదా ఓయమ్మా నిన్ను

అందముగా సాగనంపెదా ॥అత్త॥

అత్తవారీ ఇంటిలోన – అత్తమామాలనుదురమ్మా

పెత్తనము సేయాకమ్మా – సత్యముగా వరిధిల్లవమ్మా ॥అత్త॥

అక్కడా పది మంది బావలే ఓయమ్మా

నిన్ను కష్టపెట్టేదరు వారలు

అష్టవ్రతులు గలిగినట్టి అచట నలుగు రొదినేలమ్మా

వదినెలందరూ కూడి బాధసాలా పెట్టేదరే ॥అత్త॥[35]

అప్పగింత సమయంలో వధువును అప్పగించుటతో పాటు ఆమెకు బుద్దులు చెప్పుట కూడా జరుగుతుంది.

**మరొక పాట :**

రామసిలకల కొలికి రత్నంపు కొలికి రావే

రత్నంపు కొలికి కన్నుల్లాకొలికి రావె

...వయ్యారీ నీవు

మీ యత్తనీ మామ నిను బంపామంటే

మారు మాట్లాడమాకు బలమేది

ఉన్నవారి ఊరూకాదు కన్నాపెజా కాదు

కన్నతల్లీ కాదే కడుపులో నుంచ

పొద్దోతే పొరుగిళ్ళాకెళ్ళాబోకమ్మా

ఈదిలో కురిలిప్పి ముడువాబోకమ్మా

ఒకర పిలిసి నిన్ను మాటడుగుతారు

వారితో మొగమెత్తి మాట్లాడకమ్మా

ఇనవమ్మా వదినీయ ఇన్నాపంబొకటి

నేతిలో ముంచేము ఎన్నాతో పెంచి

పన్నెండేళ్ళు పెంచి మీకప్పగించి

మా బాలా బారంబు మీ బారామమ్మా[36]

– ఈ పాటలో కూడా ఇక నుంచి ఈమె భారం మీదేనంటూ కుమార్తెను అత్తవారికి అప్పగించడమే గాకుండా తల్లి తన కుమార్తెకు బుద్దులను గరపుట కూడా కలదు. మచ్చుకు మరికొన్ని చూద్దాం.

వదినరో నా పుత్రి ఇది వప్పగింత

పదిలంబుగా దీని బాగా చూడమ్మా

పాలు కాచగలేదు బాల మావదినరో

నెయ్యి కాచనేరదు నెలతసుమి వదినా

నేర్పుగ జెప్పు సీత మీదమ్మా

భాగ్యములు నీవేనే బాగుగా చూడు

బుద్ధివచ్చిన దాక దిద్దుకో వదినా

ఆకలైనగాని అన్నమడగని బాల

దాని పంపి నేను తాళాలేనమ్మా

ఎదురింటి భాగ్యమే ఏమి సేయుదు తల్లి

ఎన్నగ అత్తింట పుట్టింటికి నీవు తల్లి

కీర్తిగా మెలగుమా ననుగన్నతల్లి[37]

– ఈ పాటలో తమ బిడ్డ అల్లారు ముద్దుగా పెరగడం వలన పనులేమి నేర్వలేదనియు, మీ బిడ్డగా

భావించి కాపాడు మని తల్లిదండ్రులు అమ్మాయి అత్తమామలను ప్రార్థించుటను చూడవచ్చు.

"పుట్టింటి సీతమ్మా అత్తింటి కెళుతుంటె
బుద్దులేమని చెప్పు భూదేవి తల్లి
పోద్దోయి పొరుగిళ్ళకెళ్ళ బోకమ్మా
సందలడి చాకింటి కెళ్ళ బోకమ్మా
వీధిలో తలకురులు విప్పబోకమ్మా
పదుగురిలో పన్నెత్తి నవ్వబోకమ్మా
మందిలో కన్నెత్తి చూడబోకమ్మా
నట్టింట చిట్టూకతొక్క బోకమ్మా
ధరణిపై రోకళ్ళు దాటబోకమ్మా
పురుషుడు రామన్నకు పువ్వులందియ్యి
మరిది లక్ష్మన్నకు మడతలందియ్యి
మామ దశరధులకు మన్ననలు చెయ్యి
అత్త కౌసల్య పనులందముగ చెయ్యి[38]

అని కూతురికి బుద్దులు గరపిన విధమును చూడవచ్చు.

'పోయి రామాయమ్మ బుద్ధితో నుండే
మాయందరికి మంచి మాటతేవమ్మా
అత్తామామల మాట కడుగు దాటకుమా
చిత్తాము మెప్పించి చెలగుమో తల్లీ
బావలూ మరదలూ బంధు జనంబు
నీ వారి యెడ మాటయేమి రానీకూ
పతిని దైవముగా భక్తితో నమ్మి
మతిమంతురాలవై మనుము మాయమ్మా

– ఈ పాటలో తల్లి తన కూతురితో అత్త మామల యందు అతి భక్తితో మెలగవలెనని, బావ మరదులు యందు భయ భక్తులతో సంచరించవలెనని, భర్తను దైవంగా భావించి పూజించుమని, బుద్దిగా ఉంటూ అటు అత్తవారికి, ఇటు కన్నవారికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావలెనని బోధించినది. ఈ విధంగా అప్పగింతల పాటలన్నింటిలోని అప్పగించుటతో బాటు నీత్యుపదేశములు గావించుటను చూడవచ్చు. అయితే కొంటె నీతులను దహరించు పాటలు కూడా లేకపోలేదు. మచ్చుకు ఒకటి

'అత్తమామలు గాని – ఆడబొట్టెలుగానీ
లేరమ్మ నీదెంత – పున్నమోగాని
మగడొక్కడే గాన – మనసుకెక్కిన యట్లు
మర్థించి నీవశము – జేసి కోవమ్మ
నీమాట వినబడ్డ – నిమిషంబునందు
హడలిపోయేటట్లు – అతని భయపెట్టు
ఇరుగు పొరుగు వార – లేమైన అంటే
ఏడ్వక వెయిరెట్లు – దుమ్మెత్తి పోయి
మగడుదెచ్చిన వెల్ల – పైపైన అమ్మి
సతతంబు పుట్టింట – గడుపుమోతల్లి
పతి కోపపడినప్పు – పడియుండబోక
అంతకు పదిరెట్లు – అతని మర్థించు
ఆటలాడెడి వేళ – నతడొచ్చి కోపింప
వూరక బడి యుండ – కుండ దోయమ్మ
భర్తను వంచుకోగల – భార్య గౌరవమెన్న

ఇలా జానపదులు ప్రతి సందర్భానికి తగ్గట్టుగా పాటలను పాడేవారు.

కుటుంబంతో సమాజంతో సంబంధాలను ఏర్పరచుకొంటూ ఒకరి కష్టాలలో ఒకరు పాలు పంచుకొంటు సంతోషంగా జీవించడమే గాకుండా తాము పాడే పాటల ద్వారా తమ ఆచర వ్యవహారాలను, పద్ధతులను, ఆరోగ్య సూత్రాలను పొందు పర్చడం జరిగింది. జనాపదులు పాడే ఈ పాటల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను కట్టుబాట్లు, ఆచార వ్యవహారాల మొ॥లగు వాటిని తెలుసుకోవడానికి ఎంతగానో దోహద పడతాయి.

## సూచికలు :

1. వానరుడు – నరవతారుడు, యస్. వెంకట్రావు, పుట. 79-80
2. జానపదగేయాలు
3. స్త్రీల పాటలు – అనంతపురం మండలం, డా॥ జి.ఎస్. మోహన్, పుట. 69
4. Fundamentals of Sociology, P. Gisbert, PP-88, 89
5. పెళ్ళి – దాని పుట్టు పూర్వోత్తరాలు, తాపీ ధర్మరావు, పుట. 132-133
6. ఆంధ్రుల సాంఘికాచారములు, ఖండవల్లి లక్ష్మీరంజనం, పుట. 118-119
7. మిన్నేరు, నేదునూరి గంగాధర రావు, పుట. 144
8. స్త్రీల పాటలు – ఒక పరిశీలన, డా॥ శిష్టా లక్ష్మీనరసమ్మ, పుట. 110
9. స్త్రీల రామాయణపు పాటలు – పుట. 165
10. స్వీయ సేకరణ, పాడినవారు రాజులమ్మ
11. స్వీయ సేకరణ, పాడినవారు బొజ్జమ్మ
12. కోనసీమ జాలరి పాటలు – ఒక పరిశీలన, యు. సుబ్రహ్మణేశ్వర శర్మ, పుట. 697
13. తెలుగు జానపద సాహిత్యం – స్త్రీల గేయములలో సంప్రదాయం, డా॥ వసుందరారెడ్డి, పుట. 214
14. తూర్పుగోదావరి జిల్లా స్త్రీల పాటలు – పరిశీలన, ఎన్. ప్రకాశరావు, పుట. 71
15. సెలయేరు, నేదునూరి గంగాధరం, పుట. 35
16. విజయవిలాసము – ఆ.3, ప.95.

16. విజయవిలాసము – ఆ.3, ప.95.
17. కోనసీమ జాలరి పాటలు – ఒక పరిశీలన, యు. సుబ్రహ్మణేశ్వర శర్మ, పుట. 686
18. త్రివేణి – పుట. 39
19. స్వీయ సేకరణ, పాడినవారు ధనమ్మ
20. స్త్రీల రామాయణపు పాటలు (శాంత గోవింద నామములు) పుట. 33.34
21. స్త్రీల రామాయణపు పాటలు– పుట. 75
22. మిన్నేరు, నేదునూరి గంగాధరం – పుట. 104
23. స్త్రీల రామాయణపు పాటలు (శాంత గోవింద నామములు) పుట. 36
24. స్త్రీల పాటలు – అనంతపురం మండలం, డా॥ జి.ఎస్. మోహన్, పుట. 95
25. స్త్రీల రామాయణపు పాటలు, పుట. 75
26. స్వీయ సేకరణ, పాడినవారు చిన్నమ్మి
27. మిన్నేరు, నేదునూరి గంగాధరం – పుట. 106, 107
28. సెలయేరు, నేదునూరి గంగాధరం – పుట. 30
29. మిన్నేరు, నేదునూరి గంగాధరం – పుట.111
30. కోణసీమ జాలరి పాటలు – ఒక పరిశీలన, యు. సుబ్రహ్మణేశ్వర శర్మ, పుట. 777
31. స్వీయ సేకరణ, పాడినవారు నరసమ్మ
32. మిన్నేరు, నేదునూరి గంగాధరం – పుట. 111
33. స్త్రీల రామాయణపు పాటలు (శాంత గోవింద నామములు) పుట. 39, 40
34. కోణసీమ జాలరి పాటలు – ఒక పరిశీలన, యు. సుబ్రహ్మణేశ్వర శర్మ, పుట. 741, 742
35. స్వీయ సేకరణ, పాడినవారు చిట్టెమ్మ
36. స్వీయ సేకరణ, పాడినవారు గంగాలమ్మ
37. మున్నీరు, నేదునూరి గంగాధరం – పుట. 17, 18
38. మున్నీరు, నేదునూరి గంగాధరం – పుట. 18
39. మిన్నేరు, నేదునూరి గంగాధరం – పుట. 147